TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:13 THURSDAY ,MAY 21 ,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 13 గురువారం 21 మే 2026 పేజీలు :8 వెల: 4/-

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

## పరిశ్రమల శాఖ పై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హంసకలం వార్త మే 20

ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులుకు సంబందించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. - మిగతా2లో

# నేటి నుంచి సరస్వతి అంత్యపుష్కరాలు



హంసకలం వార్త మే 20

సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నా మని వివరించారు. బుధవారం వరంగల్ లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట మంత్రి కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ ఈ అంత్య పుష్కరాలకు రూ.200 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. రోజుకు ఒక స్వామీజీ స్నానంతో ఈ పుష్కరాలు - మిగతా2లో

# మోదీ, అమిత్ షా పై మళ్లీ రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు



హంసకలం వార్త మే 20

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మళ్లీ తన వ్యాఖ్యలతో రాజకీయ వేడి రగిల్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వారిని 'ద్రోహులు'గా పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో జరిగిన ఒక కార్యక్రమంలో - మిగతా2లో

# బండి భగీరథ్ పోక్సో కేసు..

## మరో సెక్షన్ ను జత చేసిన పోలీసులు




హంసకలం వార్త మే 20

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కీలక సాక్ష్యాలను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన నిందితుడు, పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడమే - మిగతా2లో

# యువతి కిడ్నాప్ కేసు..

## ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలు



హంసకలం వార్త మే 20

అత్తాపూర్‌లోని జోయ్ ఆస్పత్రి వద్ద యువతి కిడ్నాప్ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు. హాస్పిటల్ హౌస్ కీపింగ్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. యువతిని కిడ్నాప్ చేసిన వాహనాన్ని అత్తాపూర్‌నుంచి ఆరంఘర్ చౌరస్తా వరకు ఛేజ్ చేసినప్పటికీ కిడ్నాపర్లు పారిపోయారు. - మిగతా2లో

# నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు

- కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు వెల్లడి
- కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా అని ప్రశ్న
- కేసీఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూల్చింది బీజేపీయే అన్న బండి సంజయ్



2

# సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు.. 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు




హంసకలం వార్త మే 20

ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 13 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించారు. ఘోస్ట్ సిమ్ కార్డులతో దేశవ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరాలు - మిగతా2లో

# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం



హంసకలం వార్త మే 20

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధం పై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి - మిగతా2లో

# సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం



హంసకలం వార్త మే 20

భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాల కు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాల కు హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా - మిగతా2లో

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

-మొదటిపేజీ తరువాయి

జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్-1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# యువతి కిడ్నాప్ కేసు.. ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలు

-మొదటిపేజీ తరువాయి

కారుకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో వివరాలు సేకరించడం సవాల్‌గా మారింది. ‘రాత్రి 10:45 నిమిషాలకు ఆస్పత్రిలోని ఈఆర్ బ్లాక్ వెనుక భయాందోళనతో ఓ యువతి పరుగెత్తింది. యువతిని ఓ గుర్తు తెలియని వ్యక్తి వెంబడించాడు. సెల్లార్ వైపు పరిగెత్తిన యువతిని మా హాస్పిటల్ సిబ్బంది గమనించారు. ‘నాకు ప్రమాదం ఉంది’ అంటూ యువతి బాత్రూంలో దాక్కుంది. నన్ను కాపాడండి.. వాళ్లు నన్ను వెంబడిస్తున్నారు అంటూ యువతి ఆర్తనాదం చేసింది. సెక్యూరిటీ గార్డులను సహాయం చేయాల్సిందిగా యువతి కోరింది. హాస్పిటల్ ఎదురుగా ఆపి ఉన్న థార్ కారు దగ్గర అనుమానిత వ్యక్తులు ఉన్నారు. వారు యువతిని చూపించి ‘మా అమ్మాయి’ అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువు అంటూ యువతిని తీసుకెళ్లేందుకు అనుమానితులు ప్రయత్నించారు. వారి బెదిరింపులతో యువతి భయపడింది. ఆమె ఇష్టం లేకుండానే.. దుండగులు బెదిరించి బలవంతంగా కారు ఎక్కించారు. హాస్పిటల్ ప్రాంగణం నుంచే యువతిని బలవంతంగా తీసుకుని వెళ్లారు’ అంటూ ఫిర్యాదు పేర్కొన్నారు.

**యువతి ఫోన్ నంబర్ ట్రేస్..**

అత్తాపూర్ కిడ్నాప్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కిడ్నాప్‌కు గురైన యువతి ఫోన్ నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేశారు. జోయ్ హాస్పిటల్ పక్కనే ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్లో కొన్ని వస్తువులను యువతి కొన్నట్టు సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించారు. రాత్రి 10:30 గంటలకు క్లోజింగ్ టైమ్‌లో వెళ్లి వాటర్ బాటిల్, చాక్లెట్స్, కొన్ని స్నాక్స్‌ను యువతి కొన్నట్లు తెలుస్తోంది. ఆ టైంలో జరిపిన ట్రాన్సాక్షన్ ఆధారంగా యువతి నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేశారు. ఆమె కొనుగోలు చేసిన వస్తువులకు ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్టు గుర్తించారు. దీంతో ఫోన్ పే నోడల్ అధికారిని పోలీసులు వివరాలు అడిగారు. కాసేపట్లో ఫోన్ పే నోడల్ అధికారి నుంచి యువతి వివరాలు రానున్నట్లు పోలీసులు తెలిపారు. యువతి వివరాలు వస్తే కేసు డిటెక్ట్ అయినట్టే అని పోలీసులు చెబుతున్నారు.

# బండి భగీరథ్ పోక్సో కేసు.. మరో సెక్షన్ ను జత చేసిన పోలీసులు

-మొదటిపేజీ తరువాయి

కాకుండా, సోషల్ మీడియా అకౌంట్లను కూడా మాయం చేశాడు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో సిమ్ కార్డ్ లేకపోవడం, ఫోన్ ఖాళీగా ఉండటంతో.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద పోలీసులు ఈ కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్ 238ను (గతంలో ఐపీసీ 201) జోడించారు. చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు, నిందితుడి కంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో ఉచ్చు బిగించేందుకు సిద్ధమయ్యారు. ఐఫోన్ సెక్యూరిటీ ఫీచర్లు కఠినంగా ఉన్నప్పటికీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిపుణుల వద్ద ఉన్న ‘సెల్లెబ్రైట్’ వంటి అంతర్జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ల ద్వారా డిలీట్ అయిన చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ఐఫోన్ అంతర్గత మెమొరీని పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా, ఐక్లౌడ్ బ్యాకప్ సర్వర్ల నుండి డేటాను సేకరించేందుకు, అవసరమైతే కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. వీటితో పాటు, నిందితుడు ఫోన్ స్విచ్చాఫ్ కావడానికి ముందు ఎక్కడ ఉన్నాడు, ఎవరితో మాట్లాడాడు, ఆశ్రయం కల్పించిన తెరవెనుక సూత్రధారులు ఎవరు అనే వివరాల కోసం సెల్ టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేసును పటిష్టంగా కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు ‘ప్లాన్ బీ’ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌ను మరో కీలక సాక్ష్యంగా మార్చనున్నారు. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపు సందేశాలు, ఫొటోలు, వీడియోలను ‘రిసీవ్డ్ డేటా’ రూపంలో సేకరించి, వాటిని ధ్రువీకరించి కోర్టు ముందు ఉంచనున్నారు. పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం నేర తీవ్రతను మరింత పెంచుతుందని చట్టపరమైన నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# మోదీ, అమిత్ షా పై మళ్లీ రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు..

-మొదటిపేజీ తరువాయి

రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘మీ ప్రధానమంత్రి, హోం మంత్రి ద్రోహులు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ వ్యక్తులు మీ ముందుకు ఎప్పుడు వచ్చినా బహిరంగంగానే ఈ మాట చెప్పండి. మోదీ, అమిత్‌షా, బీజేపీ, ఆర్ఎస్ఎస్ ద్రోహులు. అంతాకలిసి దేశాన్ని అమ్మేసేందుకు పనిచేస్తున్నారు. రాజ్యంగం, వీర పాసీ, గాంధీ, అంబేద్కర్ పై బీజేపీ-ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయి’ అని రాహుల్ విమర్శించారు. పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతున్నాయని, సామాన్య కుటుంబాల పై పెనుభారం పడుతోందని రాహుల్ అన్నారు. ‘దేశ ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రజల బాధలేవీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దేశంలో ఆర్థిక తుపాన్ ముంచు కొస్తోంది. రాబోయే మూడు నాలుగు నెలల్లో గతంలో ఎన్నడూ చూడనంత స్థాయిలో ద్రవ్యోల్బణం ఉండబోతోంది. గ్యాస్, ధాన్యం, ఆయిల్ ధరలు రాబోయే రోజుల్లో ఎంత పెరగబోతున్నాయో మీరే చూడండి’ అని రాహుల్ అన్నారు. ఇలాంటి సమయంలో ఉత్తుత్తి నినాదాలు దేశాన్ని కానీ, రాజ్యాంగాన్ని కానీ పరిరక్షించలేవన్నారు. ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక వేత్తలు, అమెరికాకు మోదీ అప్పగించేశారని, ఇప్పుడు మాత్రం ప్రజలను విదేశాలకు వెళ్లొద్దని, బంగారం కొనవద్దని సలహాలిస్తున్నారని విమర్శించారు.

**తిప్పికొట్టిన బీజేపీ**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వెంటనే తిప్పికొట్టింది. యావద్దేశాన్ని అవమానించేలా రాహుల్ వ్యాఖ్యలున్నాయని తప్పుపట్టింది. ‘రాహుల్ ఈ దేశ ప్రజలను అవమానిస్తున్నారు. పాకిస్థాన్ భాషలో మాట్లాడుతున్నారు. 140 కోట్ల మంది భారతీయులను ద్రోహులని చేస్తున్నారు. అనువంశిక రాజకీయాలకు ప్రతినిధిగా మాట్లాడుతున్న మాటలు ఆయన మైండ్‌సెట్‌కు అద్దంపడుతున్నాయి. అర్బన్ నక్సల్స్ తరహాలో ఆయన మాట్లాడుతున్నారు’ అని బీజేపీ విమర్శించింది.

# మంత్రివర్గ విస్తరణకు విజయ్ రెడీ.. 15 మందికి చోటు

హంసకలం వార్త మే 20



తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ తన మంత్రివర్గాన్ని ఈనెల 21న విస్తరించనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. టీవీకే ఎమ్మెల్యేలతో పాటు, కూటమి ప్రభుత్వానికి మద్దతిస్తున్న కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఉంది. అయితే, గత వారం తమిళనాడు అసెంబ్లీలో విశ్వాసపరీక్ష సందర్భంగా టీవీకేకు మద్దతు ప్రకటించిన అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలను మాత్రం క్యాబినెట్‌లోకి తీసుకోవడం లేదు.

**కాంగ్రెస్ నామినీలు వీరే**

కాంగ్రెస్ నుంచి మంత్రివర్గంలోకి తీసుకునే ఇద్దరు నామినీల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు పి.విశ్వనాథన్, ఎస్.రమేష్ కుమార్ ఉన్నారు. వీసీకే, ఐయూఎంఎల్‌కు చెరో మంత్రిపదవి దక్కనుంది. అయితే పేర్లు ఇంకా ఖరారు కాలేదని చెబుతున్నారు. ‘గురువారంనాడు మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉంది. 15 మంది మంత్రులను క్యాబినెట్‌లోకి తీసుకోనున్నారు. ఇప్పటికే మే 10న ముఖ్యమంత్రితో సహా తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కేరళ నుంచి చెన్నైకి గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్ ఎప్పుడు వస్తారనేది బుధవారం సాయంత్రానికల్లా ఒక స్పష్టత వస్తుంది’ అని టీవీకే వర్గాలు తెలిపాయి.

**విజయ్ విముఖత..**

అన్నాడీఎంకే మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, సీవీ షణ్ముగం సారథ్యంలోని అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో చోటు కల్పించే అవకాశం ఉందనే ఊహాగానాలకు టీవీకే తెరదించింది. ఇందుకు విజయ్ విముఖత వ్యక్తం చేసినట్టు ఈ పార్టీ వివరణ ఇచ్చింది. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలోకి చోటుకల్పిస్తే టీవీకే ప్రభుత్వానికి మద్దతు కొనసాగించడంపై పునరాలోచిస్తామని సీపీఎం, వీసీకే ఇప్పటికే హెచ్చరించాయి. వీసీకే చీఫ్ తిరుమావళన్ తాజా పరిణామాలపై మాట్లాడుతూ, అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను క్యాబినెట్‌లోకి తీసుకోవడం లేదని తనకు సమాచారం అందినట్టు చెప్పారు. దీంతో టీవీకే ప్రభుత్వంలో తమ పార్టీ చేరనుందనే పరోక్ష సంకేతాలను ఇచ్చారు.

## నేటి నుంచి సరస్వతి అంత్యపుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు. లాగే ఈ పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని కొండా సురేఖ వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున సేవలందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గురువారం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కరాలు జరుగనున్నాయి.

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

-మొదటిపేజీ తరువాయి

తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ యుద్ధానికి సంబంధించిన నిర్ణయాల పై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు అని వ్యాఖ్యానించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటన పై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రికత్తల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమవేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ శాఖ మంత్రులు, ప్రతినిధుల సమావేశంలో భేదాభిప్రాయాల కారణంగా దేశాల సంయుక్త ప్రకటన ఏదీ వెలువడలేదు.

## సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు.. 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

-మొదటిపేజీ తరువాయి

చేసినట్లు గుర్తించారు. పద్దెనిమిది బృందాలతో ఏడురోజుల పాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించగా, 1,194 ఘోస్ట్ సిమ్ కార్డులను గుర్తించి, వాటిలో 544 కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరగాళ్ళకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వోడాఫోన్ ఐడియా, ఏడుగురు ఎయిర్‌టెల్, ముగ్గురు జియో పీవోఎస్ ఏజెంట్లను అరెస్టు చేశారు. సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు

-మొదటిపేజీ తరువాయి

నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసని, పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కన్న కొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే తాను కుమారుడిని అప్పగించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను ‘మీ చివరి కోరిక ఏమిటి’ అని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటామని అన్నారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందిస్తూ, కేసీఆర్ పార్టీకి లోక్ సభలో ఒక్క ఎంపీ కూడా లేరని అన్నారు. వారు ఫామ్ హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని అన్నారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని అన్నారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# సంపాదకీయం

## తమిళ తీర్పు కనువిప్పు అయ్యేనా



ఆంధ్రప్రదేశ్‌లో ఒక నాయకుడు తన నియోజకవర్గంలో ఇంటింటికీ రకరకాల కానుకలు పంపించేవాడు. ప్రతి సందర్భంలోనూ స్వీట్లు, తినుబండారాలు, పండుగల సమయంలో మగవారికి రేమాండ్ దుస్తులు, మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేసేవాడు. పెళ్లయిన ప్రతి జంటకూ బంగారు తాళిబొట్లు, పట్టు వస్త్రాలు, వెండిమెట్టెలు బహూకరించేవాడు. ఇక ఎన్నికల సమయంలోనైతే సరే సరి. ఒక ట్రక్కునే ప్రత్యేకంగా ఉపయోగించి డబ్బును విచ్చలవిడిగా పంచిపెట్టారని వార్తలు వచ్చాయి. అయితేనేం గత ఎన్నికల్లో ఆయన 43వేల ఓట్లకు పైగా తేడాతో పరాజయం పాలయ్యారు. ప్రజలు తలుచుకుంటే తమను ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా సరే వారు లొంగిపోయే అవకాశాలు లేవని చెప్పేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఈ విషయం తెలిసినప్పటికీ దేశంలో రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజలను ప్రలోభపెట్టేందుకు, ఓట్లను కొనుగోలు చేసేందుకు నానా యత్నాలు చేస్తుంటారు. దీని వల్ల ప్రజల దృష్టిలో రాజకీయ నాయకుల పట్ల ఏహ్య భావం ఏర్పడడం మినహా మరేదీ జరగదు. నాయకులు తమ ఓట్లను కొనుగోలు చేస్తున్నారంటే, వారు రాజకీయాల్లో ఉండి ఎంత సంపాదిస్తున్నారో, ఎంత ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారో అన్న సందేహాలు ప్రజలకు తప్పక ఏర్పడుతుంది. ఇదంతా మనను దోచుకున్న సొమ్మే కదా.. అన్న అభిప్రాయం చాలా మందిలో ఉన్నది. ఇటీవల తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టాయి. ప్రతి నియోజకవర్గానికీ రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పంచిపెట్టారన్నది ఒక అంచనా. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు కవర్లలో డబ్బులు ఉంచి ఈ పార్టీలు నగదును పంచిపెడుతున్న దృశ్యాలను సోషల్ మీడియాలో ప్రసారం చేసినా సరే ఎన్నికల కమిషన్ పెద్దగా పట్టించుకోలేదు. భారీ ఎత్తున డబ్బు పంచిపెడుతున్నారని 'అరప్పోర్ ఇయ్యాక్కమ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తమకు ఏ మాత్రం డబ్బులు పంచిపెట్టని సినీనటుడు విజయ్ పార్టీ టీవీకే అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా 15 మంది డీఎంకే మంత్రులు మట్టికరిచారు. నాలుగు సార్లు మంత్రిగా పనిచేసిన ఒక డీఎంకే నేతను ఒక ఆటో డ్రైవర్ ఓడించాడు. మరోచోట ఒక కారు డ్రైవర్ కొడుకు గెలిచాడు. చాలా చోట్ల భారీ ఆధిక్యతతో విజయం సాధించిన టీవీకె అభ్యర్థులు కనీసం 20 నియోజకవర్గాల్లో అతి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ధనబలం లేకుండా ఎన్నికలు జరిగి ఉంటే విజయ్ ప్రభంజనం వీచేదని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇటీవలి కాలపు ప్రజాస్వామ్య చరిత్రలో ఒక రాష్ట్రంలో ప్రజల నుంచి ఓట్లు కొనుగోలు చేయకుండా గెలిచిన ఘనత విజయ్‌కి దక్కింది. విజయ్ నిజానికి రాష్ట్రమంతటా ప్రచారం చేయలేదు. చాలా చోట్ల ఆయన కటౌట్లు, హోలోగ్రామ్‌లు, డూప్‌లతో ప్రచారం చేయించారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకుని ఆయన చాలా ర్యాలీలు రద్దు చేసుకున్నారు. టీవీకే అభ్యర్థులు కూడా చాలా చోట్ల పెద్దగా ప్రచారం చేయనేలేదు. కొన్ని చోట్ల డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులు వారికి డబ్బులు ఇచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకొమ్మని చెప్పారని సమాచారం. చాలా నియోజకవర్గాల్లో కౌంటింగ్ కేంద్రాలకు కూడా టీవీకే అభ్యర్థులు వెళ్లలేదు. తాము గెలిచామని టీవీ ప్రసారాలలో తెలుసుకుని ఆశ్చర్యపోయారు. విజయ్ సభలకు భారీ ఎత్తున జనం హాజరైనప్పటికీ పార్టీ యంత్రాంగం లేకపోవడం, స్థానిక సమీకరణ సరిగా జరగకపోవడం, నిధుల కొరత, అనుభవం లేని అనామక అభ్యర్థులతో టీవీకే విజయం సాధించడం కష్టమని చాలా మంది భావించారు. అనేక నియోజకవర్గాల్లో చిన్న వ్యాను, రెండు ఆటోరిక్షాలు, కొద్ది మంది పిల్లలు ఈలలు వేస్తూ ముందు వెళుతుండగా అభ్యర్థులు ప్రచారం సాగించారు. చాలా చోట్ల విద్యార్థులు, మహిళలే ఇంటింటికి వెళ్లి స్వచ్ఛందంగా ప్రచారం చేశారు. ప్రచారానికి చిన్నమొత్తాల్లో చందాలు సేకరించారు. కొన్ని నియోజకవర్గాల్లో టీవీకే పోస్టర్లు కూడా లేవు. టీవీకే అభ్యర్థులు రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లినా వారిని జనం గుర్తు పట్టేవారు కాదు. తమిళనాడు ఎన్నికలు పార్టీలు ధనబలంతో, కండబలంతో, వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి రావాలని చూసేవారికి గుణపాఠం కావాలి. ఎన్నికల బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి నిధులు సేకరించడం, నిధులు ఇచ్చిన వారికి రాజ్యసభ సీట్లు కేటాయించడం, చివరకు వారి సంస్థలను ప్రారంభించడం వంటి తిప్పలు పడేవారికి కనువిప్పు కలిగించాలి. అక్రమంగా నిధులు ఇచ్చిన కార్పొరేట్ సంస్థలకు క్విడ్ ప్రోకోగా ప్రాజెక్టులు కేటాయించాల్సి రావడం, ఆ ప్రాజెక్టుల్లో అవకతవకల్ని విస్మరించడం, ఓట్లు కొనుగోలు చేసినవారు మళ్లీ ఆ నష్టం భర్తీ చేసేందుకు మళ్లీ అవినీతికి పాల్పడడం వంటి దుర్లక్షణాల ద్వారా మొత్తం వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయాయి భారత రాజకీయ, అధికార వ్యవస్థలో ఈ ఎన్నికల అవినీతి కీలక పాత్ర పోషిస్తోంది. చట్టసభల్లో అవినీతిపరులు, కార్పొరేట్లు, సంపన్నులు అధికంగా కనపడుతున్నారు. సామాన్యుడు ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. దేశ జీడీపీలో 20 నుంచి 50శాతం మేరకు ఉన్న నల్లధనం ఈ ఎన్నికల వ్యవస్థలో భాగమయిందనడంలో సందేహం లేదు. నిజానికి ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.28 లక్షలు ఖర్చు పెట్టుకోవచ్చని ఎన్నికల కమిషన్ చెబుతుండగా, ఆచరణలో ఈ మొత్తం ఒక్క పూటకు ఎన్నికల వ్యయానికి సరిపోదని నేతలు అంటున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ అధికారికంగా రూ.10వేల కోట్ల నల్లధనం స్వాధీనం చేసుకున్నప్పటికీ వాస్తవానికి రూ.1.35 లక్షల కోట్లు ప్రవహించిందని, ఇది 2020లో అమెరికా ఎన్నికల్లో పెట్టిన ఖర్చు కంటే ఎంతో ఎక్కువ అని ఒక అంచనా. దేశంలో ప్రతి ఓటరుకూ సగటున రూ.1500 ముడుపులు చెల్లిస్తున్నారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ఎప్పుడో అంచనా వేసింది. ఎన్నికల కమిషన్ నియమించే ఎన్నికల పరిశీలకులు ఈ మొత్తం ప్రహసనంలో విదూషకులులా మారారనడంలో అతిశయోక్తి లేదు. ఈ పరిశీలకులు ఎన్నికల అక్రమాలను అరికట్టడం కన్నా ఏ పార్టీని గెలిపించాలన్న అంశంపైనే దృష్టి కేంద్రీకరించారన్నదే తాజా సత్యం. తమిళనాడు ప్రజలు ఈ అక్రమ, అవినీతి విషవలయానికి స్పందించారని కనపడుతోంది. విజయ్ పార్టీ నుంచి గెలిచిన 107 మంది ఎమ్మెల్యేల్లో 93 మంది తొలిసారి రాజకీయాల్లో ప్రవేశించినవారు. వారిలో సగం మంది 40--45 మధ్య వయస్సున్నవారు. తమిళనాడులో యువత, దళితులు ఏ దిశన ఆలోచిస్తున్నారో అర్థం చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. అంతేకాదు, వారికి బూటకపు అస్తిత్వ నినాదాలు, సిద్ధాంతాల పట్ల ఆసక్తి లేదని కూడా అనుకోవడానికి వీలుంది. వారికి కావల్సింది ఒక్కటే వ్యవస్థలు సరిగా పనిచేయడం. తాము చెల్లిస్తున్న డబ్బుకు తగ్గట్లుగా సమర్థమైన సేవలు లభించడం, ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్యంగా రెవిన్యూ విభాగాలు సరిగా పనిచేయడం, విద్యుత్ కోతలు, ఆలస్యాలు లేకుండా ఉండడం. రాజకీయ పార్టీలు ఊదరగొట్టే నినాదాలు చేయడం, వారి దృష్టిని మళ్లించేందుకు భావోద్వేగాలను, కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడం కంటే వ్యవస్థల్ని యువత మనోభావాలకు తగ్గట్లుగా మార్చినప్పుడే ఈ దేశం అధునాతనంగా, ఆదర్శ రాజ్యంగా మారుతుందనడంలో సందేహం లేదు. అవినీతి అధికంగా ఉన్న 182 దేశాల సూచికలో మన దేశం 91వ స్థానంలో ఉన్నప్పటికీ వ్యవస్థల్లో లుకలుకల్ని అరికట్టేందుకు ఏ ప్రభుత్వమూ చిత్తశుద్ధితో పనిచేసినట్లు కనపడడంలేదు. ఎన్నికల్లో గెలుపుపైనే దృష్టి సారించే రాజకీయ పార్టీలకు వ్యవస్థల బాగోగులపై ఆసక్తి ఉండదు. తమిళనాడులో వలే దేశ వ్యాప్తంగా యువతరాన్ని నవ రాజకీయ చైతన్యం ఆవహిస్తే తప్ప మార్పు ఆగమించే అవకాశాలు లేవు.

# కొత్త ప్రపంచానికి భారత్ ఇటలీ బాట











భారత్--ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు కీలక మలుపులో నిలిచిన తరుణమిది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవి రూపాంతరం చెందాయి. అంతర్జాతీయ వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న ప్రస్తుత సందర్భంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదానప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన పరివర్తన నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాల మధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్ల తయారీ నైపుణ్యంతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థికవృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజనీరింగ్ ప్రతిభ--విస్తృతి, ఆవిష్కరణ--వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకుగల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేము నిర్దేశించుకున్నాం. ఇది మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువల వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య--భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ--ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయన--ఔషధ, జౌళి, వ్యవసాయ--ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ--భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని చేరడంతో సరిపెట్టకుండా దాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. 'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంగల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల నవనవీన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో, ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం.. మా రెండు దేశాలతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్ర వేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రితంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ కృషి చేస్తున్నాయి. ఈ దృక్కోణంతో 'ఏఐ'ని సార్వజనీన ప్రగతికి.. ప్రత్యేకించి వర్ధమాన దేశాలకు ఒక శక్తిమంతమైన సాధనంగా మేం పరిగణిస్తున్నాం. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రితంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాద సంప్రదాయంలో పాదుకున్న మానవ--కేంద్రక 'అల్గార్--ఎథిక్స్'ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతిక--పారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదానప్రదానం ద్వారా ప్రతి దేశం 'ఏఐ'ని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్--2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం.. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంటే-- ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భావితరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి. ప్రపంచ దేశాల శ్రేయస్సుకు భరోసా లభించాలంటే జాతీయ భద్రత--స్థిరత్వం అత్యావశ్యకం. కాబట్టే రక్షణ--భద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో సహకార బలోపేతానికి ఇటలీ, భారత్ సంకల్పించాయి. కీలక సముద్ర మార్గాల భద్రతకు భరోసాతోపాటు ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్‌వర్క్‌లు, మాదకద్రవ్యాల దొంగ రవాణా, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనగల సామర్థ్యాన్ని పటిష్ఠం చేయడంలో ఈ సహకారం దోహదం చేస్తుంది. మా భాగస్వామ్యానికి ఇంధన రంగం మరో మూలస్తంభం. వైవిధ్యభరిత ఇంధన వనరుల దిశగా ప్రపంచ ప్రస్థానంలో ఆవిష్కరణ, పెట్టుబడులు, సహకారం అత్యావశ్యకాలు. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాల నుంచి హైడ్రోజన్ సాంకేతికతల దాకా.. స్మార్ట్ గ్రిడ్‌ల నుంచి పునరుత్థాన మౌలిక సదుపాయాల వరకూ భారత్ --ఇటలీ ఇప్పటికే సహకారం కొనసాగిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. పునరుత్పాదక మౌలిక సదుపాయాల కల్పనలో ఇటలీకిగల అత్యాధునిక సాంకేతికతతోపాటు ఐరోపాకు ఇంధన ముఖద్వారంగా దాని వ్యూహాత్మక పాత్రకు ఇది సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం. భౌతిక, డిజిటల్, మానవ అనుసంధానమే మా భాగస్వామ్యాన్ని మరింతగా పెనవేసిన సూత్రం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండో--పసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. కాబట్టి, ఈ ప్రాంతాలను వేర్వేరు పరిధులుగా కాకుండా అంతకంతకూ పరస్పర సంధానితం అవుతున్న ప్రదేశాలుగా పరిగణించాలి. వాస్తవానికి.. హిందూ మహాసముద్రాన్ని ఐరోపాతో ముడిపెట్టే వాణిజ్య, సాంకేతిక, ఇంధన, డేటా సహా సమాలోచనలకు కీలక మార్గమైన భారత--మధ్యధరా ప్రాంతం ఆవిర్భావానికి మా రెండు దేశాలే ప్రత్యక్ష సాక్షులు. సరిగ్గా ఈ పరస్పర సంధాన క్రమంలోనే మన స్నేహబంధం సహజ రీతిలో ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిఢవిల్లుతూ-- రెండు ఖండాలను కలిపి, కొత్త ప్రపంచ గమనానికి రూపుదిద్దుతుంది. ఈ పరిస్థితుల నడుమ ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాలు, డిజిటల్ నెట్‌వర్క్‌లు, ఇంధన వ్యవస్థలు, పటిష్ఠ సరఫరా వ్యవస్థలతో మన ప్రాంతాలను అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్న దార్శనికతకు భారత్--మధ్యప్రాచ్య--ఐరోపా ఆర్థిక కారిడార్ (ఐఎంఈసీ) ఒక ప్రతీక. ఈ దృక్కోణానికి వాస్తవికతను ఆపాదించడంలో ఇతర భాగస్వాములతో సమష్టిగా కృషి చేసేందుకు భారత్, ఇటలీల నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి. మాకెదురయ్యే ఉమ్మడి సవాళ్ల పరిష్కారంలో రెండు దేశాల మధ్యగల ప్రగాఢ భాగస్వామ్యం, శాశ్వత సాంస్కృతిక సంబంధాలను సద్వినియోగం చేసుకుంటాం. భారతీయ సంస్కృతి ప్రబోధించే 'ధర్మం' అనే ఉదాత్త భావన మా చర్యలకు మార్గనిర్దేశం చేసే బాధ్యతా స్ఫూర్తిని ఉత్తేజితం చేస్తుంది. ఆ క్రమంలో నేటి పరస్పర సంధాన డిజిటల్ యుగంలోనూ 'వసుధైవ కుటుంబకం' (యావత్ ప్రపంచం ఒకే కుటుంబం) సూత్రం మానవాళి మొత్తాన్నీ ముడివేయడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. పునరుజ్జీవన పథంలో పయనించే ఇటలీ మానవతావాద సంప్రదాయం కూడా ఈ విలువలను సహజంగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి గౌరవాన్ని, ప్రజలను--సమాజాలను ఏకం చేసే సంస్కృతికిగల అపార శక్తిని ఇది తేటతెల్లం చేస్తుంది. అందుకే, రెండు దేశాల ప్రజలకు కేంద్ర స్థానమిస్తూ బలమైన, భవిష్యత్ దృక్కోణ సహిత భారత్--ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేయాలని మా సంయుక్త దార్శనికత లక్ష్యనిర్దేశం చేసుకుంది.

# ఖమ్మం ఖిల్లాలో ఘనంగా హెరిటేజ్ వాక్ నిర్వహణ

-జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి
-ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యాటక ఉత్సవాలు..
-ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పన..
-పర్యాటక అభివృద్ధికి హెరిటేజ్ కార్యక్రమాలు దోహదం చేస్తాయి..
-జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ విజయవంతం..




హంసకలం వార్త

ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖమ్మం ఖిల్లాలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం ఖిల్లా నుండి జాఫర్ బావి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు.ఖమ్మం ఖిల్లా మెట్లు వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ ఖిల్లా పైభాగం వరకు కొనసాగి అనంతరం జాఫర్ బావి వరకు నిర్వహించా మనీ, విజయవంతంగా హెరిటేజ్ వాక్ పూర్తయిందనీ,కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతతో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి అవకాశాలపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ నాయక్, టూరిజం శాఖ సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, హెరిటేజ్ విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసు ను చేధించిన పోలీసులు

-నిందితుడు అరెస్ట్
-మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన వైరా ఏసీపీ సారంగపాణి..




హంసకలం వార్త

మధిర రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామం నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో మే 15 న జరిగిన మహిళ హత్య కేసును మధిర రూరల్ పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. కేసు వివరాల ప్రకారం... మే 16 న గోపిశెట్టి సాయిరామ్ ఏ సాయి అనే వ్యక్తి తన అక్క గోపిశెట్టి కల్పన (28), నివాసం మేడూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా, కనిపించడం లేదని... కల్పన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ప్రతిరోజు లాగే మే 15 న ఉదయం మేడూరు నుండి మధిరకు విధులకు వెళ్తున్నానని ఇంటి నుండి బయలుదేరిన ఆమె ఆ రోజు కార్యాలయానికి హాజరు కాలేదని సహోద్యోగి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందిందని, అదే రోజు యార్లగడ్డ చెన్నారావు అనే వ్యక్తి 'మీ అక్క నా దగ్గర ఉంది, మాట్లాడుకోవాలి' అంటూ ఫోన్ సందేశం పంపినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. అనంతరం సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చేపట్టగా, కృష్ణాపురం గ్రామ శివారులోని నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో కల్పన మృతదేహం లభ్యమైందని తెలిపారు. ఆమె మెడ, నోటి చుట్టూ చున్నీ బిగించి హత్య చేసినట్లు గుర్తించారు. మధిర రూరల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించగా, నిందితుడు యార్లగడ్డ అంకుశరావు ఏ చెన్నారావు (30), కనుమూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా వాసి, మృతురాలితో సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు వెల్లడైందన్నారు. వ్యక్తిగత సంబంధాల విషయంలో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు అనంతరం నిందితుడు కోసం (3) ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడుని అదుపులోకి తీసుకోడం జరిగిందని తెలిపారు.15.05.2026 న నిందితుడు మృతురాలిని తన ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం సమీపంలోని ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో, తమ సంబంధం గురించి తన భార్యకు చెబుతానని మృతురాలు హెచ్చరించడంతో, కోపోద్రిక్తుడైన నిందితుడు చున్నీతో ఆమె మెడ బిగించి హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు.20.05.2026 తేదీన అంబరుపేట వెంచర్ ప్రాంతంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి, అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత సంబంధాల పేరుతో మోసపోయే పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిచయాలు, వ్యక్తిగత సంబంధాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద ప్రవర్తన గమనించిన వెంటనే కుటుంబ సభ్యులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏకాంత ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత విషయాలపై వివాదాలు తీవ్రరూపం దాల్చే పరిస్థితులను నివా రించాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. మధు, మధిర రూరల్ ఎస్ఐ బి. లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

# ప్రజా పాలన జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష



హంసకలం వార్త

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం తన చాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అదే స్పూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, సీ.పీ.ఓ రతన్, డీ.పీ.ఆర్.ఓ ఎన్.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తుది దశకు చేరిన ధాన్యం సేకరణ ప్రక్రియ

-మరో వారం రోజుల్లో పూర్తి కానున్న కొనుగోళ్లు
-వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు



హంసకలం వార్త

జిల్లాలో యాసంగి--2026 సీజన్కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మరో వారం రోజుల్లోపు ధాన్యం సేకరణను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం తరపున ధాన్యం సేకరణ కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈసారి జిల్లాలో మొత్తం 739 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, సుమారు రూ.1,500 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రైతుల ఖాతాల్లో రూ.1,320 కోట్ల బిల్లులు జమ అయినట్లు వివరించారు. ధాన్యం సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ఇప్పటికే 430 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 40 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, మరో వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనుగోళ్లు పూర్తి అవుతాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వరి కోతలు ఆలస్యంగా జరుగుతున్న కారణంగా ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తుండటంతో, అలాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు, రైస్మిల్లుల అన్లోడింగ్ పాయింట్ల వద్ద రైతులు, హమాలీల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ సాచెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొన్ని రైస్మిల్లుల వద్ద మధ్యాహ్న సమయంలో ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం సేకరణ చివరి దశలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తూ, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండటంతో పాటు, ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలను సమకూర్చినట్లు, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేయాలి

-ధాన్యం తరలించేందుకు వాహనాలు,లోడింగ్,అన్ లోడింగ్ కు హమాలీల సంఖ్యను ఇంకా పెంచాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



హంసకలం వార్త

ధాన్యం నిల్వ చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాంలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.ధాన్యం సేకరణ,గోదాంల వినియోగం,తూకం వేసిన బస్తాల తరలింపు,వాహనాలు,హమాలీల సంఖ్య పెంపు,మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం,సన్న రకాల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం,తదితర అంశాలపై బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,పౌర సరఫరాల,సహకార శాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ,మెప్మా,వ్యవసాయ,తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని,చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని,రైతులకు క్షేత్ర స్థాయిలో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా సేకరణలో పురోగతి పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో ఉన్న గోదాంలను వినియోగంలోకి తీసుకువచ్చి,ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.తూకం వేసిన ధాన్యం బస్తాలను వాహనాల ద్వారా తరలించడం,దీని కోసం సరిపడా వాహనాలు సమకూర్చేలా సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.హమాలీల సంఖ్యను మరింత పెంచి ధాన్యం లోడింగ్,మిల్లులు,అపరల్ పార్కులో అన్ లోడింగ్ చేయడంలో వేగం పెంచాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,వచ్చే సీజన్ లో రైతులు సన్న రకం వరి సాగు చేసేలా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన,విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.అకాల వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని,త్వరితగతిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

హంసకలం వార్త



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ యాక్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు,రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శనంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో బహుముఖ సేవలందిస్తున్న అతి పెద్ద సంస్థ అని కలెక్టర్ పేర్కొన్నారు. మే15 నుండి జూన్ 15, 2026 వరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని, ?రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, క్యాన్సర్, సికిల్ సెల్, తలసేమియా రోగులకు ఉచిత రక్తాన్ని అందించడం, సీనియర్ సిటిజన్స్ హోమ్స్, అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి ఎన్నో అద్భుతమైన సామాజిక సేవలు అందుతున్నాయని కలెక్టర్ వివరించారు.?18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఈ సంస్థలో సభ్యుడిగా చేరుటకు అర్హుడని, ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా జీవిత / వైస్ ప్యాట్రన్ / ప్యాట్రన్ సభ్యునిగా చేరవచ్చని సూచించారు. సభ్యత్వ నమోదు కొరకు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఐడి ప్రూఫ్ నిమిత్తం ఆధార్ కార్డు / ఓటర్ ఐడి కార్డ్ / పాన్ కార్డ్ అవసరమవుతాయని తెలిపారు.?సభ్యులుగా చేరదలచిన వారు అధికారిక వెబ్సైట్ గూగుల్ ప్లే స్టోర్ నుండి "తెలంగాణ రెడ్ క్రాస్" మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని గానీ నమోదు చేసుకోవచ్చని, ?జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్లుగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ / డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ / ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్రామీణ అభివృద్ధి అధికారిని నియమించామని, వారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా డాటా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రెగ్యులర్ గా సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, ఉపాధి కల్పనాధికారి ,రాజశేఖర్, సహాయ కార్మిక అధికారి మహమ్మద్ రఫీ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్, తదితరులు, పాల్గొన్నారు.

# దొంగతనం కేసును చేదించిన బోత్ పోలీసులు పూర్తి నగదు రికవరి

హంసకలం వార్త




నిర్మల్ జిల్లాలోని సోనాల మండలం సాకేర గ్రామంలో జరిగిన 70 వేల రూపాయల నగదు దొంగతనం చేసిన కేసును బోథ్ పోలీసులు వేగంగా చేదించారు.సాంకేతిక ఆధారాలు అనుమానితుల కదలికలను పరిశీలించి అదే గ్రామానికి చెందిన నిందితుడు చౌహాన్ సాయి తండ్రి మోతిలాల్ ను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు నేరని ఒప్పుకున్నాడు. స్నేహితుడు వద్ద నుండి పూర్తిగా 70 వేల రూపాయలను పోలీసులు రికవరీ చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు. బోథ్ సిఐ డి.గురుస్వామి ఎస్సై పురుషోత్తం,పోలీస్ సిబ్బందిని ఎస్పి అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఇళ్లలో నగదు విలువైన వస్తువుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు, అందించాలని పోలీస్ లు సూచించారు.

# సాయుధ రిజర్వ్ సిబ్బంది సమర్థవంతమైన పోలీసింగ్ వెనుక ఉన్న బలం

-ఎస్పీ అఖిల్ మహాజన్

హంసకలం వార్త



ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను కాపాడటంలో సివిల్ పోలీస్ కార్యకలాపాలకు సహకరించడంలో సాయుధ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పోషిస్తున్న కీలక పాత్రను ప్రశంసిస్తూ, వారితో ఒక ప్రత్యేక సమావేశం గ్రీవెన్స్ దర్బార్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సిబ్బంది యొక్క వ్యక్తిగత మరియు శాఖాపరమైన సమస్యలను ఓపికగా విని, నిజమైన సమస్యలను పరిష్కరించడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఉన్నతా అధికారులను నిర్భయంగా సంప్రదించి, సమస్యలను చట్టబద్ధంగా మరియు శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన సిబ్బందిని ప్రోత్సహించారు. సిబ్బంది తమ పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని,క్రమశిక్షణ మరియు మంచి ప్రవర్తనను పాటించాలని, ప్రజల్లో పోలీస్ శాఖ గౌరవాన్ని,ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు.చెడు అలవాట్లకు,వ్యసనాలకు దూరంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు.ఉద్యోగుల సంక్షేమాన్ని హైలైట్ చేస్తూ, కష్ట సమయాల్లో తమ కుటుంబాలను సురక్షితంగా ఉంచుకోవడానికి ప్రతి పోలీస్ సిబ్బంది మంచి టర్మ్ ఇన్సూరెన్స్ మరియు ఆరోగ్య పాలసీలను ఎంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఆర్థిక విషయాలలో ఇతరులకు పూచీకత్తుగా నిలిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అంకితమైన ఈ కార్యక్రమం,పరస్పర సంభాషణలతో కూడిన మరియు సంక్షేమ ఆధారిత కార్యక్రమంగా సాగింది, ఇందులో సీనియర్ ఏఆర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


# హనుమంతుని గుళ్లోకి హరిజన్స్ రావద్దు

-మల్లాపూర్ ఘటన లేవనెత్తుతున్న అనేక ప్రశ్నలు

-దేవుడి ముందు కూడా కులమేనా?

-80 ఏళ్ల స్వాతంత్ర్యం ఇచ్చింది ఇదేనా

హంసకలం వార్త





మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం మల్లాపూర్ గ్రామంలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీస్తోంది.పరీక్షకు వెళ్లే ముందు దేవుడిని దర్శించుకుని మొక్కు తీర్చుకోవాలని వెళ్లిన ఓ ఎస్సీ మాదిగ విద్యార్థిని ఆలయంలోకి రానీయకుండా అడ్డుకోవడం,"హరిజన్స్ గుడిలోకి రావద్దు" అంటూ కులం పేరుతో అవమానించిన వీడియో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆ వర్గాల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తుంది. సాధారణంగా చూస్తే ఇది ఒక చిన్న గ్రామంలో జరిగిన వివాదంలా కనిపించొచ్చు.కానీ,లోతుగా పరిశీలిస్తే ఇది కేవలం ఒక విద్యార్థి అవమానానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు,భారత సమాజంలో ఇంకా పూర్తిగా చెరగని కుల వివక్ష మానసికతకు అద్దం పట్టే ఘటనగా కనిపిస్తోంది.

**-దేవుడి ముందు అందరూ సమానమే కాదా?**

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించింది. దేవాలయ ప్రవేశం నుంచి విద్య,ఉపాధి,గౌరవప్రద జీవనం వరకు ఎలాంటి కుల వివక్ష ఉండకూడదని స్పష్టంగా చెబుతోంది.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయులు పోరాడింది కూడా ఇలాంటి సామాజిక అవమానాలు తొలగిపోవాలనే లక్ష్యంతోనే.కానీ, స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఇంకా కొన్ని గ్రామాల్లో దేవాలయాల ముందు కులం అడిగే పరిస్థితులు కొనసాగుతున్నాయంటే ఇది సమాజం ఆలోచించాల్సిన విషయం.ఒక విద్యార్థి పరీక్షకు ముందు దేవుడిని ప్రార్థించుకోవాలని వెళ్లడం సహజం.కానీ,అతనికి దేవుడి గుడిలో ప్రవేశం కంటే ముందు తన కులాన్ని గుర్తుచేయడం ఎంతటి మానసిక వేదన కలిగిస్తుందో ఊహించాల్సిందే."నాకు పరీక్ష ఉంది మొక్కు కుంటాను" అని చెప్పినా వినకుండా అడ్డుకోవడం పరిస్థితి తీవ్రతను చూపిస్తుంది.

**-ముందుగానే వీడియో రికార్డు...ఎందుకు?**

ఈ ఘటనలో మరింత ఆలోచింపజేసే అంశం ఏమిటంటే.. ఆ విద్యార్థి ముందుగానే వీడియో రికార్డు ఆన్ చేసి ఆలయానికి వెళ్లాడనే విషయం.అంటే అతనికి ముందే ఏదో జరుగుతుందనే భయం లేదా అనుభవం ఉన్నట్టే కనిపిస్తోంది.గ్రామంలో ఇలాంటి వివక్ష ముందునుంచే కొనసాగుతుందనే అనుమానం కూడా దీనితో బలపడుతోంది.ఇది కేవలం ఒకరోజు జరిగిన ఘర్షణ అయితే,ఎందుకు ఒక విద్యార్థి ముందే వీడియో తీసే అవసరం వచ్చింది? అనే ప్రశ్న సహజంగానే వస్తోంది.సోషల్ మీడియాలో కూడా చాలామంది ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ "ఇది యాదృచ్ఛిక ఘటన కాదు గ్రామీణ సమాజంలో ఇంకా దాగి ఉన్న కుల వివక్షపై బయటపడిన సంఘటన"గా అభిప్రాయపడుతున్నారు.

**-"హరిజన్" అనే పదమే వివాదాస్పదం**

ఈ ఘటనలో వినిపిస్తున్న "హరిజన్" అనే పదంపైనా చర్చ జరుగుతోంది.మహాత్మా గాంధీ ఒకప్పుడు దళితులను గౌరవప్రదంగా సంబోధించేందుకు ఈ పదాన్ని ఉపయోగించినట్లు చెబుతారు.ప్రస్తుతం చాలా దళిత సంఘాలు ఈ పదాన్ని అవమానకరంగా భావిస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కూడా అధికారిక వాడకంలో "దళితులు" లేదా సంబంధిత కులపేర్లనే ఉపయోగించాలని సూచనలు ఉన్నాయి.ఇలాంటి సమయంలో "హరిజన్స్ గుడిలోకి రావద్దు" అనే వ్యాఖ్య సామాజికంగా మరింత బాధాకరంగా మారింది.

**-దేవాలయాలు భక్తికి కేంద్రాలా...కులానికి కంచెలా?**

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో దళితుల దేవాలయ ప్రవేశంపై గతంలో కూడా వివాదాలు చోటుచేసుకున్నాయి.కొన్ని చోట్ల వేరు పాత్రలు,వేరు కూర్చోవడం, వేరు శ్మశానాలు వంటి వివక్ష ఇంకా కనిపిస్తూనే ఉంది.చట్టాలు మారినా మనస్తత్వాలు మారకపోతే సామాజిక సమానత్వం పూర్తిగా సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.దేవాలయం అనేది భక్తికి ప్రతీక.అక్కడ మనిషి కులం, ఆర్థిక స్థితి,వర్గం కాదు,భక్తి మాత్రమే ముఖ్యం కావాలి.కానీ,దేవుడి గుడి ద్వారాల దగ్గరే కులం అడిగే పరిస్థితులు కొనసాగితే అది సమాజానికి అవమానమేనని సామాజికవేత్తలు అంటున్నారు.

**-ప్రభుత్వ అధికారుల పాత్ర ఏమిటి?**

ఈ ఘటనపై అధికార యంత్రాంగం స్పందించి నిజానిజాలు వెలికితీయాలని,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.అంతేకాదు గ్రామాల్లో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ఇంటతో అయిపోలేదు,ప్రశ్న ఇంకా మిగిలే ఉంది.దేశం చంద్రుడిపై అడుగు పెడుతోంది. డిజిటల్ ఇండియా, అభివృద్ధి, సూపర్ పవర్ అనే మాటలు వినిపిస్తున్నాయి. కానీ,అదే సమయంలో ఓ విద్యార్థి దేవుడిని దర్శించుకోవడానికి కూడా తన కులం కారణంగా అవమానం ఎదుర్కొంటున్నాడంటే, నిజమైన సామాజిక స్వేచ్ఛ ఎంతవరకు సాధించామన్న ప్రశ్న మళ్లీ ముందుకొస్తోంది. ఎందుకంటే, దేవుడి ముందు మనిషిని ఆపేది గుడి తలుపు కాదు...సమాజపు కుల మనస్తత్వమే.

# ప్రజలతో పోలీసులు స్నేహ పూర్వకంగా మెలగాలి

-5 వ టౌన్ ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

హంసకలం వార్త



ప్రజలతో పోలీసులు స్నేహ పూర్వకంగా మెలగాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు.నిజామాబాద్ నగరం లోని టౌన్ 5 పోలీస్ స్టేషన్ ను తనిఖీలు చేపట్టారు.ప్రజలతో మెలగాల్సిన తీరును సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలు అందించడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలనీ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు.ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలనీ సూచించారు.అలాగే నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టౌన్-5 పోలీస్ స్టేషన్‌ను సాయి చైతన్య ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ కు పోలీస్ అధికారులు , సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్ , భద్రతా పరికరాలు , ఆయుధాల నిర్వహణ , రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం , ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి , వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు.తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్ , కేసుల నమోదు , పెండింగ్ కేసుల దర్యాప్తు , బీట్ డ్యూటీ వ్యవస్థ , రౌడీషీటర్లు మరియు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే స్టేషన్‌లో అమలవుతున్న "5 ఎస్ విధానం" అమలు తీరును సమీక్షించి , ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు.స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల డిజిటల్ నిర్వహణ , సిబ్బంది హాజరు , డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో , పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు , కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి , అట్టి ప్రాంతాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి , చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24గంటలు సిబ్బంది హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో నిజామాబాదు ఎ.సి.పి ప్రకాష్ యాదవ్ , నార్త్ రూరల్ సి. ఐ శ్రీనివాస్ , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ అంజయ్య , టౌన్ 5 ఎస్. ఐ గంగాధర్ , ఎస్. ఐ 2 లక్ష్మయ్య మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హంస కలం వార్త
గురువారం 21 మే 2026

# ప్రకృతి పరిరక్షణకు కలం, గళం కదలాలి




-ది ఎర్త్ సెంటర్‌లో పర్యావరణ రచయితల సమ్మేళనం
-వాతావరణ మార్పులపై సమాజాన్ని చైతన్యపరచాలని కవులు, కళాకారులకు పిలుపు
-ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం
-సృజనాత్మకతతో పర్యావరణ చైతన్యం వ్యాప్తి చేయాలని గోరేటి వెంకన్న, జయరాజు, లీలా లక్ష్మారెడ్డి పిలుపు

హంసకలం వార్త

సమాజ మార్పు, ప్రకృతి పరిరక్షణ దిశలో పౌరుల్ని చైతన్యపరిచేలా కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు పర్యావరణ అంశాల్ని తమ ఇతివృత్తం చేసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించేందుకు దీన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని ఆధునిక వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, సహజకవి జయరాజ్ తదితరులు కవులు, కళాకారులను కోరారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్ వేదికగా సీజీఆర్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల పర్యావరణ రచయితల సమ్మేళనం ఆలోచనాత్మక సందేశాలతో, ప్రకృతి పరిరక్షణ పట్ల సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రోజురోజుకూ తీవ్రతరం అవుతున్న వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవుల నరికి వేయడం, నీటి వనరుల క్షీణత, మానవ ఆరోగ్యంపై పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కవులు, రచయితలు, కళాకారులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయంతో నిలిచిందన్నారు. కానీ ఆధునిక జీవన విధానంలో మనిషి ప్రకృతికి దూరమవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. "పరిమితతత్వం, ప్రశాంతతత్వం, సహజత్వం" అనే విలువలతో జీవించగలిగితేనే సమాజం సుస్థిర అభివృద్ధి వైపు నడుస్తుందని పేర్కొన్నారు. నేటి తరానికి ప్రకృతి విలువలను తెలియజేయడం కవులు, రచయితలు, కళాకారుల బాధ్యతగా మారిందన్నారు. తమ కలం, గానం, కళారూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి, గాయకుడు జయరాజు మాట్లాడుతూ పర్యావరణం ఆరోగ్యంగా ఉంటేనే మానవ ఆరోగ్యం భద్రంగా ఉంటుందని అన్నారు. చెట్లు, నీరు, గాలి కలుషితమైతే మనిషి జీవితం కూడా సంక్షోభంలో పడుతుందని హెచ్చరించారు. ప్రతి వ్యక్తి పర్యావరణ అనుకూల జీవనశైలిని అలవాటు చేసుకోవాలని, చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణను ఉద్యమంలా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని పలు దేశాల్లో చెట్లను దేవతలుగా భావించి పూజించే సంప్రదాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రకృతిని కేవలం వనరుగా కాకుండా జీవనాధారంగా చూడాలని సూచించారు. భారతదేశంలో కూడా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సంప్రదాయాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సమాచార కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ కవిత్వం, సాహిత్యం సమాజాన్ని మేల్కొలిపే శక్తివంతమైన ఆయుధాలని పేర్కొన్నారు. ఒక మంచి కవిత, ఒక చైతన్య గీతం సమాజంలో ఆలోచన రేకెత్తించి మార్పుకు దారితీస్తుందని చెప్పారు. రచయితలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రేవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సిక్కిం వంటి రాష్ట్రాలు హరిత విప్లవానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణలో అక్కడి ప్రజల భాగస్వామ్యం దేశానికి మార్గదర్శకమని చెప్పారు. అలాంటి ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి ప్రత్యక్ష అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణపై మరింత బాధ్యత పెరుగుతుందని తెలిపారు. సీజీఆర్ సంస్థ గత 16 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న పర్యావరణ ఉద్యమంలో కవులు, కళాకారులు, గాయకులు అందించినసహకారం అభినందనీయమన్నారు. ఈ సమ్మేళనం మరో పర్యావరణ ఉద్యమానికి నాంది కావాలని ఆకాంక్షించారు. సీజీఆర్ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ రెండు రోజుల సమ్మేళనంలో పాల్గొంటున్న కవులు, రచయితలు, కళాకారులు వినూత్నమైన కళారూపాలు, చైతన్య రచనలు రూపొందించాలని కోరారు. వాటి ద్వారా పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ చైతన్యం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని ప్రకృతి వైపు మళ్లించే బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు.ఈ కార్యక్రమంలో వందేమాతరం రవీందర్ రావు, కార్యక్రమ సమన్వయకర్త యానాల వెంకటరెడ్డి, డాక్టర్ జగన్, ఎస్‌కే లెనిన్ బాబు, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి,సుస్థిర పుడమి పత్రిక సంపాదకులు రమేష్ రావు, శంషాబాద్ ఏసిపి నాగభూషణంతో పాటు సీజీఆర్ సంస్థ ప్రతినిధులు నాగేష్, రజనీకాంత్, శంకరయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు వరి ధాన్యం వేగంగా అన్లోడ్ చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




హంసకలం వార్త

రైస్ మిల్లర్లు వరి ధాన్యం లారీలను ఎక్కువ సమయం నిరీక్షింప చేయకుండా వేగంగా అన్లోడ్ చేసుకోవాలని, అదేవిధంగా ధాన్యంలో కోతలు విధించడానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండలం పరిధిలోని సాయి గోపాల ఇండస్ట్రీస్‌ను సందర్శించి వరి అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా, మండల పరిధిలోని పాతపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రం, చెలిమిల గ్రామ శివారులలో మెప్మా వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిల్లర్లకు పలు కీలక సూచనలు చేశారు. రైస్ మిల్లర్లు వరి ధాన్యం లారీలను ఎక్కువ సమయం నిరీక్షింప చేయకుండా వేగంగా అన్లోడ్ చేసుకోవాలని, అదేవిధంగా ధాన్యంలో కోతలు విధించడానికి వీల్లేదని సూచించారు. రైతులు ధాన్యం యొక్క తేమ శాతం నిర్దేశించిన దానికన్నా తక్కువే ఇస్తున్నారన్నారు. వరి ధాన్యంలో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించవద్దని స్పష్టం చేశారు. అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, మిల్లులు, గోదాముల వద్ద వేచి ఉన్న లారీలను వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని సూచించారు. ట్రక్ షీట్లను వెంటనే వాట్సాప్ ద్వారా పీపీసీ ఇన్‌చార్జ్‌లకు పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. దీంతో ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తై రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అవుతాయని తెలిపారు. పాత పల్లి, చెలిమెల గ్రామాల వద్ద వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి దాన్యం నమోదు రిజిస్టర్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ఇన్‌చార్జ్‌లకు సూచనలు చేస్తూ, తేమశాతాన్ని పరిశీలించి వెంటనే రైతులను నిరీక్షింప చేయకుండా తూకం చేసి లోడ్ చేయాలని సూచించారు. రైతులు వరిని శుభ్రపరిచి తీసుకురావాలని అవగాహన కల్పించాలని తెలిపారు. దీంతో మిల్లర్లు కోతలు విధించే ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని ప్రశ్నించగా ట్రాన్స్పోర్ట్ కు సంబంధించి కొంత లారీల కొరత ఉందని రైతులు చెప్పగా అదనపు లారీ లు పంపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వరి ధాన్యం తరలింపు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అదేవిధంగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని వర్షం వస్తే రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఇన్చార్జిలకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, ఎంపీడీవో ప్రవీణ్, రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో ఉపాధి హామీ పనులు వేగవంతం

-వేసవి ఇబ్బందులు లేకుండా ఉపాధి పనులకు ప్రత్యేక చర్యలు
-ఉపాధి హామీ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



హంసకలం వార్త

ఉపాధి హామీ పథకం (MGNREGS) చేయూత పింఛన్ల అమలుపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య రంగరాజన్ , జిల్లాల కలెక్టర్లు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్, దేవ సహాయం, సంబంధిత శాఖల అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ....... గ్రామీణ ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి కార్మిక కుటుంబానికి పని దినాలు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, చెక్‌డ్యామ్‌లు, కాలువల శుభ్రత వంటి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స, విశ్రాంతి సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీల వేతనాల చెల్లింపులు ఆలస్యం కాకుండా సకాలంలో జరగేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని సూచించారు.చేయూత పింఛన్ల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించి అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా పింఛన్లు సక్రమంగా, పారదర్శకంగా అందేలా జిల్లా స్థాయిలో పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,....... నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా, క్రమబద్ధంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పనులు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కూలీలకు తాగునీరు, నీడ, భోజన విరామం, ప్రథమ చికిత్స వంటి అవసరమైన సౌకర్యాలు పనుల ప్రదేశాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అదేవిధంగా, ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే తాను స్వయంగా ఉపాధి హామీ పనుల ప్రదేశాలను పర్యవేక్షిస్తున్నానని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పనుల నాణ్యత, కూలీల హాజరు, వేతనాల చెల్లింపుల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా స్థాయిలో ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు, పనుల పురోగతి, కూలీలకు కల్పిస్తున్న వసతుల వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులకు సమగ్రంగా తెలియజేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతి, చేయూత పింఛన్ల పంపిణీ పరిస్థితులపై కూడా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సమీక్షించి సంబంధిత వివరాలను వెల్లడించారు.

## ఎన్నారైల సంక్షేమం..రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్యకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి కృషి

హంసకలం వార్త

తెలంగాణ రాష్ట్రంలో కొత్త ఎన్నారై విధివిధానాల రూపకల్పనలో ఆంధ్రప్రదేశ్ పర్యటన కీలకంగా మారనుందని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఆంధ్రప్రదేశ రాష్ట్రంలో పర్యటించారు. ఈ నెల 20,21 తేదీల్లో రెండు రోజుల పాటు సాగనున్న పర్యటనలో భాగంగా మొదటి రోజు అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా.బిఎం వినోద్ కుమార్ , నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో భేటీ అయ్యారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా తాడేపల్లి లో గల స్పెనర్ట్ ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ కార్యాలయంలో ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్,ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేమూరు విజయ్ కుమార్, సిఈఓ కృష్ణ మోహన్ లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాల పై చర్చించారు. ఏపీ ప్రభుత్వం ఎన్నారై సంక్షేమానికి ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న విధివిధానాలను మంత్రి,సదరు సిఈఓ కూలంకషంగా వివరించారు. ఎన్నారై ల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే విధివిధానాల రూపకల్పనలో ఏపీ ప్రభుత్వం,తమ మంత్రిత్వ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. త్వరలోనే ఏపీ ఎన్ ఆర్ టి టవర్ నిర్మాణం నిర్మాణ దశలో ఉందని త్వరలోనే పూర్తి చూసుకుంటుందన్నారు. దాని ద్వారా దాదాపు 5 నుండి 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారుగా 50 లక్షల మంది వలసదారులున్నారని దీని ద్వారా ప్రభుత్వానికి 30 వేల పైచిలుకు రెమిటెన్స్ రావడంతో పాటు విదేశాల్లో మన రాష్ట్రాల యొక్క ప్రాధాన్యతను పెంపొందించడంలో ఆస్కారం ఉంటుందన్నారు. వాళ్ళంతా మనవాళ్లే కాబట్టి వారి సంక్షేమం చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనదే అని చెప్పారు. అటు మంత్రి తన వ్యక్తిగత జీవితంలో చదువు, ఉద్యోగం రీత్యా విదేశాల్లో గడిపిన కాలంలోని అనుభవాలను పంచుకున్నారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని.. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభత్వ ఎన్నారై కొత్త పాలసీని రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వివిధ రాష్ట్రాల పర్యటనలకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం ఆనందంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో తెలంగాణలో ఎన్నారై సంక్షేమానికి విధివిధానాల రూపకల్పనకు ఈ పర్యటన ఎంతో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్నారై ల కొరకు అమలు చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. ఎన్నారై ల కొరకు ఇతర దేశాల్లో ప్రత్యేకంగా ప్రతినిధులను నియమించడం, ఎన్నారైలను ఏకతాటిపై తీసుకురావడానికి ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లా కలెక్టరేట్ లో ఎన్ఆర్ఐ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి రెవెన్యూ పోలీసు సిబ్బందిని కేటాయించడం,24 గంటల పాటు సహాయ కేంద్రం,పంజాబ్ రాష్ట్ర స్ఫూర్తితో ఏపీ పోలీస్ ఎన్ అర్ ఐ సెల్ ఏర్పాటు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ,పరిమితులు లేకుండా ప్రవాసాంధ్ర బీమా తదితర ప్రధాన అంశాలు ఆమోదయోగ్యంగాను, అభినందించదగినవి అని కొనియాడారు. అనంతరం తెలంగాణలో గల్ఫ్ కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు . అనారోగ్య సమస్యలు మరి ముఖ్యంగా తెలియని నేరాలకు జైలు శిక్ష అనుభవించడం, బాధితుల కుటుంబ సభ్యుల ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యలను గురించి వివరించారు. అనుకొని సంఘటనల్లో మృతి చెందితే పార్థివదేహాన్ని తరలించడంలో ఎదుర్కొంటున్న సమస్యను గుర్తుచేశారు. వీటన్నింటిని అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అడుగులు వేస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నారైలకు తలెత్తే సమస్యలను ఇరుపక్షాల సహకారంతో సమిష్టిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విదేశాలకు వెళ్లే ముందు పకడ్బందీగా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను చేపట్టాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారులు వేమూరు రవికుమార్, సీఈఓ డా.కృష్ణ మోహన్ తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు లతో పాటు మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, రాష్ట్ర గీత కార్మిక సహకారం కార్పొరేషన్ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్, విజయ్ కొర్రా, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త



# బిజినెస్

## హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్




ప్రైవేటు బ్యాంకు దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తన ఉద్యోగులకు రెండు రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ ముడి చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటించాలని, కార్పొరేట్ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఇటీవల పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ ఆ మేరకు నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్‌లకు సంబంధించిన ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తున్నట్లు తెలిపింది. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అయితే దీనిని నెలరోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని,ఆ తర్వాత పనితీరును బట్టి కొనసాగించాలా లేదా అనే నిర్ణయం ఉంటుందని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీలోని ట్రెజరీ ఆపరేషన్స్,బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, హెచ్‌ఆర్ డిపార్టుమెంట్, ఫైనాన్స్ అకౌంట్స్ వంటి అంతర్గత విభాగాల ఉద్యోగులకు మాత్రమే ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ వర్తిస్తుంది. కస్టమర్లతో నేరుగా సంబంధం ఉండే ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వర్తించదు. ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల వినియోగదారులకు బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని బ్యాంకు స్పష్టం చేసింది.

## మోదీ 'మెలోడీ' గిఫ్ట్.. కన్ఫ్యూజ్ అయిన ఇన్వెస్టర్లు!




- మెలొడీ చాక్లెట్ వీడియోతో పెరిగిన పార్లే ఇండస్ట్రీస్ షేర్లు
- ఐదు శాతం పెరిగిన షేరు విలువ
- మెలొడీ చాక్లెట్‌కు పార్లే ఇండస్ట్రీస్‌కు సంబంధం లేదు
- చాక్లెట్లు తయారు చేసే పార్లే ప్రొడక్ట్స్ స్టాక్ మార్కెట్లో లేదు
- పేరు కన్ఫ్యూజన్‌తో మోసపోయిన ఇన్వెస్టర్లు

ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ ప్రధాని మెలోనికి 'పార్లే మెలొడీ' చాక్లెట్ గిఫ్ట్ ఇచ్చిన వీడియో సోషల్ మీడియాను ఎంతగా ఊపేస్తుందో తెలిసిందే. అయితే ఈ వైరల్ వీడియో స్టాక్ మార్కెట్‌లో ఊహించని అలజడి సృష్టించింది. ఒకేలా ఉన్న పేరును చూసి ఇన్వెస్టర్లు తొందరపడి తప్పుడు కంపెనీ షేర్లను కొనేశారు.

**షేర్ మార్కెట్లో మెలొడీ మాయ**

మోదీ చాక్లెట్ ప్యాకెట్ ఇచ్చిన వీడియో బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే దలాల్ స్ట్రీట్‌లో హల్‌చల్ మొదలైంది. 'పార్లే ఇండస్ట్రీస్' అనే కంపెనీ షేర్లు ఇంట్రాడేలో దాదాపు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. గత వారం రోజులుగా ఈ పెన్నీ స్టాక్ ఏకంగా ఏడు శాతం లాభపడింది. అంతా బానే ఉన్నా ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది.

**కంపెనీ వేరు.. చాక్లెట్ వేరు**

మనందరికీ తెలిసిన ఫేమస్ 'మెలొడీ' చాక్లెట్‌ను తయారు చేసేది 'పార్లే ప్రొడక్ట్స్' అనే ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ. పార్లే-జి బిస్కెట్లు, మొనాకో, మ్యాంగో బైట్ వంటి బ్రాండ్లు అన్నీ ఈ సంస్థవే. ఇది పూర్తిగా ప్రైవేట్ కంపెనీ. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాలేదు. కానీ ఇన్వెస్టర్లు మాత్రం మార్కెట్లో లిస్టైన 'పార్లే ఇండస్ట్రీస్' అనే ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ కంపెనీని చూసి.. అదే చాక్లెట్ కంపెనీ అనుకుని ఎగబడి కొనేశారు.

**సోషల్ మీడియా తెచ్చిన తిప్పలు**

ట్రెండింగ్‌లో ఉన్న వార్తలను, సెలబ్రిటీల కామెంట్లను చూసి గుడ్డిగా ఇన్వెస్టర్లు ఎలా మోసపోతున్నారో చెప్పడానికి ఈ ఘటనే ఓ ఉదాహరణ. సోషల్ మీడియాలో 'పార్లే మెలొడీ' ట్రెండ్ అవగానే కనీసం బ్యాగ్రౌండ్ చెక్ చేసుకోకుండా ట్రేడర్లు మార్కెట్లోకి దూకేశారు. ఇలాంటి తప్పుడు అంచనాల వల్ల తక్కువ ధర ఉండే పెన్నీ స్టాక్స్ ఒక్కోసారి అకస్మాత్తుగా పెరిగిపోతుంటాయి.

# పాక్ పై చారిత్రక సిరీస్ విజయం..

## డబ్ల్యూటీసీ స్టాండింగ్స్‌లో భారత్‌ను దాటేసిన బంగ్లాదేశ్




పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ అద్భుత ప్రదర్శనతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. సిల్హెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయంతో ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2027 స్టాండింగ్స్‌లో బంగ్లాదేశ్ అనూహ్యంగా భారత్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ విన్-లాస్ పర్సంటేజ్ 58.33 శాతానికి చేరుకుంది. దీంతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. మరోవైపు ఇప్పటివరకు 9 టెస్టులాడి 4 విజయాలు, 4 ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఉన్న టీమిండియా ఆరో స్థానానికి పడిపోయింది. ఈ సిరీస్‌లో ఓటమితో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. ఈ ఏడాది భారత్ ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదు. త్వరలో ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు ఆడనున్నా, అది డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగం కాదు. ఇవాళ మ్యాచ్ చివరి రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే బంగ్లాదేశ్ బౌలర్లు పాకిస్థాన్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు. 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 316/7తో ఐదో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్, మరో 42 పరుగులు మాత్రమే జోడించి 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్ (94) చివరి వరకు పోరాడినప్పటికీ, సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో బంగ్లా స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ 6 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించాడు. చివరి రోజు రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ప్రమాదకరంగా మారుతున్న రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లా విజయం ఖాయమైంది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే మొట్టమొదటి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 2024లో పాకిస్థాన్ గడ్డ పై 2-0తో సిరీస్ గెలిచిన బంగ్లా, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

## సూర్యవంశీ పై లక్నో ఓనర్ గోయెంకా ప్రశంసలు



ఐపీఎల్ 2026 సీజన్ ప్లే ఆఫ్ రేసులో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుకు చెందిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 10 సిక్సర్లు, 7 ఫోర్లతో 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌కు ముగ్ధుడైన లక్నో ఫ్రాంచైజీ అధినేత సంజీవ్ గోయెంకా... స్టేడియం స్టాండ్స్‌లో స్వయంగా నిలబడి చప్పట్లతో వైభవ్‌కు అభినందనలు తెలిపారు. అంతేకాకుండా, మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఈ యువ ఆటగాడితో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. "ఈ ప్రపంచం ఇప్పటికే అతనిలోని ప్రతిభను చూసింది.. ఈ దేశం అతనిలో గొప్ప భవిష్యత్తును చూస్తోంది.. అతని భుజాలపై ఉన్న బాధ్యతను మోయగల సమర్థత అతనికి ఉంది" అంటూ సంజీవ్ గోయెంకా ఎక్స్ వేదికగా కొనియాడారు. మ్యాచ్ అనంతరం వైభవ్‌తో గోయెంకా మాట్లాడిన దృశ్యాలను చూసి, సునీల్ గవాస్కర్ వంటి కామెంటేటర్లు సరదాగా 'గోయెంకా త్వరలోనే వైభవ్ కోసం వేలంలో భారీగా బిడ్ వేయబోతున్నారు' అని వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## భారత టీ20 కెప్టెన్ రేసులో శ్రేయస్ అయ్యర్: రికీ పాంటింగ్




భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ రేసు పై పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం జట్టులోకి పునరాగమనం చేయడమే కాకుండా.. సూర్యకుమార్ యాదవ్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని పాంటింగ్ మద్దతు ప్రకటించాడు.

**రేసులో అయ్యర్**

భారత టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్ ముందున్నాడని రికీ పాంటింగ్ స్పష్టం చేశాడు. ఐపీఎల్ టోర్నీ ప్రారంభంలో అయ్యర్ ఎంతటి నాణ్యమైన ఆటగాడో అందరం చూశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మైదానం, వెలుపలా అతడు ఉన్న స్థితిని బట్టి చూస్తే కెప్టెన్సీకి సరైన ఎంపికగా కనిపిస్తున్నాడని అభిప్రాయపడ్డాడు.

**ఆటలో పరిణతి**

అయ్యర్ తన కెరీర్‌లో మునుపెన్నడూ లేనంత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడని పాంటింగ్ కొనియాడాడు. ప్రస్తుతం అతడు తన ఆటపై పూర్తి నియంత్రణతో ఉన్నాడని చెప్పాడు. ఐపీఎల్ లాంటి సుదీర్ఘమైన లీగ్‌లో 14 మ్యాచ్‌ల పాటు ఒకే రకమైన స్థిరత్వాన్ని కొనసాగించడం ఎవరికైనా కష్టమేనని, వ్యక్తిగతంగానూ, జట్టుగానూ హెచ్చుతగ్గులు రావడం సహజమేనని అయ్యర్ ఇటీవలి పేలవ ఫామ్‌ను సమర్థించాడు.

# 'డ్రాగన్'లో 'లూగర్'గా ఎన్టీఆర్.. ఆ పేరు వెనుక అంత అర్థం ఉందా



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ పాత్ర పేరును 'లూగర్'గా పరిచయం చేయడం అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను శక్తిమంతంగా తీర్చిదిద్దుతారన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో రాకీ, 'సలార్'లో దేవా మాదిరిగానే 'డ్రాగన్'లో ఎన్టీఆర్ పాత్రకు 'లూగర్' అనే పేరు పెట్టడం వెనుక ప్రత్యేక కారణం ఉన్నట్టు తెలుస్తోంది. 'లూగర్' అనేది ప్రపంచ యుద్ధాల కాలంలో జర్మనీ సైన్యం వాడిన ఒక క్లాసిక్ పిస్టల్. అత్యంత కచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి ఇది ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక వ్యక్తిలా కాకుండా, శత్రువులను వేటాడే ఆయుధంలా ఉండబోతోందని ఈ పేరు సూచిస్తోంది. కాగా, ఈ విషయంపై చిత్రబృందం ఇంకా స్పందించలేదు. అయితే, 'లూగర్' అనే పదానికి గూగుల్, వీకిపిడియాలో మాత్రం ఈ అర్థం కనిపిస్తుంది. ఈ చిత్రం 1967 కాలం నాటి అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో సాగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లాక, ఓపియం వ్యాపారం 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ', 'గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ'లుగా విడిపోతుంది. ఈ రెండు కంపెనీల మధ్య ఆధిపత్య పోరు, రక్తపాతం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ఎన్టీఆర్ 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ'కి చెందిన 'అసాసిన్-ఇన్-చీఫ్'గా కనిపించనున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత కథానాయికగా నటిస్తుండగా, నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్' అనే కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది.

## ఆసుపత్రి వద్ద కెమెరాలు చూసి చిర్రెత్తిపోయిన సల్మాన్ ఖాన్



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ పాపరాజీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబైలోని ఓ ఆసుపత్రి వద్ద తనను చుట్టుముట్టిన ఫొటోగ్రాఫర్ల తీరుపై మండిపడ్డాడు. 'మీకు పిచ్చెక్కిందా?' (పాగల్ హో క్యా?) అంటూ సీరియస్ అయ్యాడు. ఈ ఘటన మంగళవారం ముంబైలోని మహిమ్ ప్రాంతంలో ఉన్న హిందూజా ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. ఆసుపత్రి నుంచి బయటకు వస్తున్న సల్మాన్‌ను ఫొటోగ్రాఫర్లు చుట్టుముట్టారు. ఆయన తన కారు వైపు వెళ్తుండగా ఒక్కసారిగా ఆగి వెనక్కి తిరిగి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పద్ధతిగా ప్రవర్తించాలని హెచ్చరించాడు. సల్మాన్ తీవ్ర స్వరంతో మాట్లాడటంతో ఫొటోగ్రాఫర్లు వెంటనే క్షమాపణలు చెప్పి వీడియో తీయడం ఆపేశారు. అయితే, సల్మాన్ ఖాన్ ఎవరిని పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లారనే విషయంపై స్పష్టత రాలేదు. కాగా, తాను ఒంటరిగా ఉన్నానంటూ వస్తున్న వార్తలపై సల్మాన్ ఇటీవల స్పందించిన విషయం తెలిసిందే. తనకు పెద్ద కుటుంబం, స్నేహితులు ఉన్నారని, తాను ఒంటరిని కాదని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు ఎక్కువ మందితో ఉండి తన సోషల్ బ్యాటరీ అయిపోతుందని, అందుకే కొంత 'మీ టైమ్' తీసుకుంటానని తన ఎక్స్ ఖాతాలో వివరించాడు. ఈ నేపథ్యంలోనే ఆయన పాపరాజీ పై అసహనం వ్యక్తం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

## బాలయ్య సినిమాలో మంచు మనోజ్.. తన గాడ్ ఫాదర్ అంటూ మనోజ్ భావోద్వేగం



నందమూరి బాలకృష్ణ, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం నుంచి టాలీవుడ్‌ను ఊపేసే ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. గతంలో వీరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు, నటుడు మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి ఆహ్వానిస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమవడంపై మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన జీవితంలో ఎంతో ఆశగా కోరుకున్న అత్యంత ప్రత్యేకమైన బహుమతి ఈ పుట్టినరోజున లభించిందని, తన గాడ్ ఫాదర్, లయన్ నందమూరి బాలకృష్ణతో కలిసి నటించాలనే ఎన్నో ఏళ్ల నిరీక్షణ, కల ఈ సినిమాతో నిజమవుతోందని రాసుకొచ్చారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు చేసినా బాలయ్య అన్నతో, గోపీచంద్ మలినేని గారితో ఉన్న అనుబంధం వల్ల ఈ సినిమా తన హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే థియేటర్లలో ప్రేక్షకులకు ఒక పెద్ద పండగ లాంటి విందు ఉండబోతోందని, చూసే ప్రతి క్షణం ఈ నిరీక్షణకు తగినట్టుగా ఉంటుందని అభిమానులకు మనోజ్ పక్కా ప్రామిస్ చేశారు. అయితే, ఈ సినిమాలో మనోజ్ పోషిస్తున్న పాత్రపై చిత్ర బృందం ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తున్నప్పటికీ, ఆయన ఒక పవర్‌ఫుల్ విలన్ పాత్రలో బాలయ్యను ఢీకొట్టబోతున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో 'మిరాయ్', 'భైరవం' వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో వరుస విజయాలు అందుకున్న మనోజ్... ఇప్పుడు బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. గతంలో మనోజ్ నటించిన 'ఊ కొడతారా.. ఉలిక్కి పడతారా' చిత్రంలో బాలయ్య ఒక పవర్‌ఫుల్ రోల్ చేయగా, ఇప్పుడు బాలయ్య సినిమా కోసం మనోజ్ ఏకంగా విలన్‌గా రంగంలోకి దిగడం ఈ ప్రాజెక్ట్ పై అంచనాలను డబుల్ చేసింది.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రెస్ నోట్... క్లారిటీ ఇచ్చిన నిర్మాత సురేష్ బాబు



తెలుగు ఫిల్మ్ ఛాంబర్ పేరుతో 'పెద్ది' సినిమా విడుదల పై సోషల్ మీడియాలో వైరల్ అయిన ప్రెస్ నోట్‌పై అధ్యక్షుడు, నిర్మాత డి.సురేష్ బాబు స్పందించారు. ఆ ప్రెస్ నోట్ ఫేక్ అని, ఛాంబర్ నుంచి తాము అధికారికంగా ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. 'పెద్ది' సినిమా ప్రదర్శనకు ఎగ్జిబిటర్లు అందరూ ఆమోదం తెలిపారని, ఆ చిత్రానికి లైన్ క్లియర్ అయిందంటూ ఓ ప్రెస్ నోట్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో విస్తృతంగా ప్రచారమైంది. అయితే, దీనిపై స్పందించిన సురేష్ బాబు, ఆ నోట్‌తో ఛాంబర్‌కు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజీ విధానంపై ఛాంబర్ ఇంకా అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన వివరించారు. కొంతకాలంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజీ విధానంపై చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి ఓ ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటైంది. ఈ క్రమంలో సోమవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో అద్దె, పర్సంటేజీ విధానంపై సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్టు వార్తలు వచ్చాయి. 'పెద్ది' చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని కొందరు ఎగ్జిబిటర్లు చెప్పినట్లు తెలిసింది. ఈ వాడివేడి చర్చల అనంతరం, సురేష్ బాబు సంతకం లేకుండా ఈ ఫేక్ ప్రెస్ నోట్ బయటకు రావడం గమనార్హం. మొత్తంగా, 'పెద్ది' చిత్ర విడుదల పై ఎలాంటి అడ్డంకులు లేవని వచ్చిన వార్తలు అవాస్తవమని ఫిల్మ్ ఛాంబర్ స్పష్టం చేసింది.

# ఎన్టీఆర్ బర్త్‌డే.. అర్ధరాత్రి తారక్ ఇంటి వద్ద జనసంద్రం.. అభిమానుల సంబరాలు వేరే లెవెల్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అంబరాన్నంటాయి. అటు అభిమానుల కోలాహలం, ఇటు కొత్త సినిమా అప్డేట్‌తో సోషల్ మీడియా హోరెత్తుతోంది. మే 19 అర్ధరాత్రి 12 గంటలు దాటగానే హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. 'జై ఎన్టీఆర్' అంటూ నినాదాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ పండగ వాతావరణాన్ని సృష్టించారు. అభిమానుల ప్రేమకు స్పందించిన తారక్, ఇంటి బయటకు వచ్చి అభివాదం చేస్తూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి.

**'డ్రాగన్'గా ఎన్టీఆర్ మాస్ అవతారం!**

మరోవైపు ఎన్టీఆర్ అభిమానులకు బర్త్‌డే కానుకగా ఆయన నటిస్తున్న 'డ్రాగన్' చిత్రం నుంచి పవర్‌ఫుల్ గ్లింప్స్ విడుదలైంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా గ్లింప్స్‌లో ఎన్టీఆర్ సరికొత్త మాస్ అవతారంలో కనిపించారు. గణనీయంగా బరువు తగ్గి, రగ్గడ్ గడ్డం, వైల్డ్ హెయిర్ స్టైల్‌తో ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. దాదాపు 4 నిమిషాల నిడివి గల ఈ వీడియోలో ఎన్టీఆర్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్, రవి బస్రూర్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ గ్లింప్స్ విడుదలైన కొద్ది క్షణాల్లోనే ట్రెండింగ్‌లోకి వచ్చింది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449